


చెహోవ్ కథ

# ఊహా ప్రేయసి

"మీరే నా సర్వస్వం. మీరే నా ప్రాణం. నా ఆనందం, నా సుఖం అంతా మీతోనే. మీరు లేక నేను బతకను. కనీసం ఒక్కసారి నామీద కరుణించండి. మీ స్పర్శ, మీ చూపు నాకు క్షణమైనా దక్కవా? ఈ సాయంత్రం ఎనిమిదింటికి ఫాంహౌస్‌లో మీకోసం నిరీక్షిస్తూంటాను. నేనెవరో మీకు తెలియదని సందేహించకండి. యువతిని, అందగత్తెను. జనం నా వెంట పడతారు. నా మనసు మాత్రం మీకు అంకితమైంది. దయచేసి, కనికరించి ఒక్కసారి



రారూ..."

పావెల్ యువానిచ్‌కు పెళ్లై ఎనిమిదేళ్లయింది. మర్యాదస్తుడు. భార్యా విధేయుడు. ఉత్తరం అతణ్ణి వుద్రేకపరచిన మాట నిజమే అయినప్పటికీ భయం మొదలైంది. అంతలోనే సందేహం.

"నాన్సెన్స్. ఏమిటే పిచ్చి రాత!" అనుకొని విసుక్కున్నాడు. నలిపి, చించి పారేయ్యాలనుకున్నవాడు కాస్తా, ఈ ఉత్తరం మరొక్కసారి చదివి అక్షరాల్ని పరికించి చూశాడు.

"మీరే నా సర్వస్వంట. నేనేమన్నా స్కూలు కుర్రాణ్ణా ఏమిటి వుత్తరాలు చదివి ప్రేమలో పడటానికి! 'రా' అనగానే వెళ్లాలా? ప్రేమ వ్యవహారాలు నడిపే వయసా నాది! బహుశా ఈ రాసిన మనిషికి మనస్థిమితం లేదేమో! పిచ్చాసుపత్రినుంచి పారిపోయి వచ్చిన మనిషి! నిజంగా మర్యాద, గౌరవం తెలిసినవాళ్లు కొత్తవాళ్లకు యిలాంటి వుత్తరాలు రాయగలరా? పైగా పెళ్లైన మగాడికి! నీతిలేని మనుషులు."

**రష్యన్‌మూలం: చెహోవ్.**
**తెలుగు గొంతు: కరుణారుణ**

పావెల్ యువానిచ్ ప్రేమను గురించి ఆలోచించడం ఎప్పుడో మానేశాడు. మంచి భార్య, మంచి యిల్లు, మంచి జీవితం. ఇంకా ప్రేమెందుకు? ఉత్తరం అతడిలో చిలిపి కోరికలు రేపినా రేపకపోయినా, దానివెనక మిస్టరీ మాత్రం తికమక పెట్టింది? ఎవరీ స్త్రీ? ఎలా వుంటుంది? ఎందుకు రాసింది? దస్తూరి స్త్రీదే. ఆట పట్టించడానికి రాసిన ఉత్తరంలా కూడా కనిపించడం లేదు. కాని ఈ అపరచిత సుందరికి తనమీద ఎందుకింత కోరిక! తన గురించి ఆమెకేమైనా తెలుసా? పెళ్లికి నోచుకోని ముదురు కట్టె ఎవరన్నా రాసిందా? ఛ ఛ. 'యువతిని. అందగత్తెను' అని రాసిందే.

తను ఫాంహౌస్‌కు ఎన్నోసార్లు వెళ్లాడు. అక్కడ ఎప్పుడూ ఏ స్త్రీ కూడా కనిపించలేదే... కాని ఎందుకింత ఆత్మశంక. నిజంగా తను అందంగా లేడా! భార్యతో బుద్ధిగా కాపురం చేసినంత మాత్రాన మరొక స్త్రీకి తనమీద కోరిక కలుగ కూడదా!...

పరస్పర విరుద్ధమైన ఆలోచనలు.

"ఉరుకుపరుగుల ఈ జీవితంలో ప్రేమలో పడేటంత తీరికున్నదా ఆమెకు! ప్రేమట! దూరంనించి ఒకటి రెండుసార్లు చూడగానే ప్రేమ కలుగుతుందా? నేనెవర్ని? నా స్వభావమేమిటి? నా అలవాట్లేమిటి? వగైరా తెలుసుకోకుండానే ప్రేమించెయ్యడం...

సడెన్‌గా జ్ఞాపకం వచ్చింది... నిన్నో, మొన్నో పార్కులో ఈవెనింగ్ వాక్‌కు వెళ్లినప్పుడు నీలం రంగు డ్రెస్సు వేసుకున్న ఓ యువతి తనను పరికించి చూసింది. తను ఓ బెంచీ మీద కూర్చుంటే కాసింత దూరంలో ఆవిడా కూర్చుంది.

"ఆవిడేనా?"... కాదు, కాదని నమ్మించుకో ప్రయత్నించాడు. ఎంతో అమాయకంగా, సుకుమారంగా వున్న ఆవిడ జిడ్డుమొహం, చిరుబొజ్జా వున్న తనను యిష్టపడుతుందా?

ఇంపాజిబుల్!

పరధ్యానంగానే టేబుల్ దగ్గిర లంచ్‌కు కూర్చున్నాడు.

"ఆవిడ నిజంగా అందగత్తె. ఆ కళ్లు, ఆ పెదాలు... తన భార్య తనను విడిచి ఒక్కరోజు కూడా వుండలేనంటుందే... అలాంటి తనను మరొక స్త్రీ (ఆవిడే)

ప్రేమించడంలో అంతగా ఆశ్చర్యపడవలసిందేముంది!

"ఏదో దీర్ఘాలోచనలో వున్నట్టున్నావు?" అంటూ అడిగింది భార్య చిరునవ్వుతో.

"అబ్బే, ఏం లేదు. కాస్త తలనొప్పిగా వుంటేనూ..."

ఆమె ప్రేమిస్తే అది ఆమె యిష్టం. కాని తను ఆమె మీద మనసుపడటం మాత్రం తప్పు. కాని మగాడు తన జన్మశత్రువును ఓడించడం అంత సులభం కాదు...

నిద్ర పోదామని మంచం మీద వాలాడు గాని ఆలోచనలు పడుకోనిస్తాయా..

నేను నిజంగా ఫాంహౌస్‌కు వెడతాననే అనుకుంటుందా ఆవిడ?... పోనీ... వెడితే తప్పేమిటి! దూరంనించి చూసి వస్తాను. ఏం మాట్లాడుతుందో, ఏం చేస్తుందో చూద్దాం... వెళ్లకపోతే ఏం చేస్తుంది? నిరాశతో, విరహంతో, ప్రేమోద్రేకంతో ఏమైనా అఘాయిత్యం చేస్తుందా? వట్టి ఫూల్‌లాగుంది.

కోటు వేసుకుని, హాట్ పెట్టుకున్నాడు.

"ఏమిటి, అలా పూలరంగడిలా తయారయ్యావు?" భార్య.

"బద్ధకంగా వుంది. కాస్త అలా తిరిగి వస్తాను."

ఫాంహౌజ్ వైపు నడుస్తూంటే గుండెవేగం పెరిగింది. ఎవరూ తనను చూడటం లేదు గదా. చల్లటి గాలి వీస్తున్నది. అయినా సన్నగా చెమట పట్టింది. పార్కు దాటి వెళుతుంటే ఎవరెవరో స్త్రీలు... వీళ్లలో ఎవరై వుంటుంది?... ఫాంహౌస్‌లో ఎక్కడ వుంటుంది? ఎవరో ఎలా పోల్చుకోవడం? పొడుగాటి నారింజ చెట్లు. పూలపొదలు. గుబుర్లు. ఎక్కడ దాక్కుందో! ... భయమెందుకూ? ఫాంహౌజ్‌కు రావడం తప్పా! ఎవరైనా పలకరిస్తే మాట్లాడటం తప్పా!...

కాని, గుండె తన మాట వింటుందా! ఆనాటి స్త్రీ కనిపించినట్టే వుంది. అదే డ్రెస్సు. సెంటువాసన. అదే ముక్కు. అవే కళ్లు... ఆమె వేడి శ్వాసలో తన చర్మం కమిలిపోతున్నది...

అబ్బబ్బ. ఎందుకీ వణుకు. పెళ్లైనవాళ్లు ప్రేమించకూడదా! రాకరాక వచ్చిన ఈ అవకాశాన్ని చేజార్చుకోవటమెందుకు? ఈ ప్రణయ రహస్యం భార్యకు తెలిసే అవకాశమే లేదు. తెలిస్తే మాత్రం ఒక్కసారి! ఈమెను తిరస్కరించి ప్రేమరాహిత్యంలో జీవితమంతా గడపాలా? చిలకాగోరింకల ఎనిమిదేళ్ల కాపురం ఈ ఒక్కనాటితో కూలిపోతుందా! డామిట్. అంతా అనవసరభయం. గోరంతలు కొండంతలుగా వూహించుకొని తనను తాను చిత్రహింస పెట్టుకుంటున్నాడు.

చీకటి. పూలపొదల వెనక బెంచీమీద ఎవరో... ఎవరో కాదు.. ఆవిడే... ధైర్యం కూడదీసుకుని ముందుకు కదిలాడు.

తీరా చూస్తే... యువకుడు... వీడా. బామ్మర్ది గాడు.

"మిత్యా!"

"నువ్వా యిలా వచ్చావేం?" మిత్యా విసుక్కున్నాడు.

"నేను నా డిగ్రీ థీసిస్ గురించి ఆలోచించటానికి యిక్కడికి వచ్చాను. ఒంటరిగా వుంటే తప్ప అది వీలుపడదు. కాసేపు నువ్వు మరెక్కడికన్నా వెళ్లి కూర్చో రాదూ."

ఈ మిత్యాగాడు యిప్పుడే దాపురించాలా!

"గుడ్. నువ్వు అలా దూరంగా వెళ్లి

**అబ్బబ్బ. ఎందుకీ వణుకు. పెళ్లైనవాళ్లు ప్రేమించకూడదా! రాకరాక వచ్చిన ఈ అవకాశాన్ని చేజార్చుకోవటమెందుకు? ఈ ప్రణయ రహస్యం భార్యకు తెలిసే అవకాశమే లేదు. తెలిస్తే మాత్రం ఒక్కసారి! ఈమెను తిరస్కరించి ప్రేమరాహిత్యంలో జీవితమంతా గడపాలా?**

ఆలోచించుకో. నేను కాసేపు ఈ బెంచీ మీద పడుకోవాలి. క్విక్, గెటప్." అంటూ కసురుకున్నాడు పావెల్.

"పడుకోవటానికి ఈ బెంచీయే దొరికిందా, థీసిస్ చాలా ముఖ్యం. నువ్వెళ్లి పో ప్లీజ్" పైకి కనిపించకపోయినా మిత్యా పళ్లు పటపటా కొరికాడు.

పావెల్‌లో సహనం చచ్చిపోతోంది. ఆమె యిప్పటికే వచ్చేసి వుండాలి.

"మిత్యా, నువ్వింకా కుర్రాడివి. నా మీద నీకేమైనా గౌరవముంటే వెళ్లిపోతావు. నా బాబు గదూ."

"అంత అథారిటీ పనికిరాదు. ఎప్పుడూ నువ్వు చెప్పినట్టే నేను వినాలా. ఈ ఒక్కసారికి నువ్వే వెళ్లిపో, పావెల్."

ఈ మొండి వెధవను చెడామడా వాయించి, బరబరా ఈడ్చుకొని వెళ్లి ఫాంహౌస్ బయట పారేసివస్తే సరి.

"నేను అథారిటీ చేస్తున్నాను. నువ్వెప్పుడూ నేను చెప్పినట్టే విన్నావు. ఈ ఒక్కసారికి నా ప్రాణం తియ్యక వెళ్లిరా మిత్యా."

"నో. మొదట యిక్కడికి వచ్చి కూర్చున్నది నేను. నువ్వే నన్ను డిస్టర్బ్ చేస్తున్నావు. ప్లీజ్ గో."

ఇక లాభం లేదు.

"మిత్యా, ఇదే లాస్ట్ వార్నింగ్. వెడతావా, వెళ్లవా?"

"చెప్పానుగా. నువ్వేం చేసినా సరే. నేను వెళ్లనుగాక వెళ్లను. అంతేకాదు. నువ్వు తక్షణమే యిక్కణ్నుంచి అదృశ్యమవ్వాలని కూడా నా కోరిక."

చెట్టుచాటున ఎవరో స్త్రీ కదిలినట్టుగా తోచింది. దూరంగా కదిలిపోతున్న అడుగుల సవ్వడి.

ఛ. మంచి అవకాశం తప్పిపోయింది.

పావెల్ మొహం కోపంతో, నిరాశతో ఎర్రబడింది.

"మిత్యా, నీవంటి స్కాండ్రెల్ లోకంలో వుండడు. ఇడియట్. ఫూల్. గాడిద. పంది. నీచబుద్ధి."

"థాంక్యూ. నా థీసిస్ పాడుచెయ్యటమే కాకుండా పైగా తిట్లా?"

ఇంక చెయ్యగలిగిందేమీ లేక పావెల్ యింటికి చేరి డైనింగ్ టేబుల్ ముందర కూలబడ్డాడు. ఎప్పటిలాగే ఎదురుగా చిరునవ్వుతో భార్యా, పక్కన బామ్మర్దీ.

"పిచ్చెక్కిందా, ఎందుకు నవ్వుతున్నావు?" అంటూ యింతెత్తు ఎగిరాడు పావెల్.

భర్త కోపం చూసి ఆమె నవ్వాపుకోలేక పోయింది.

"ఇవ్వాళ వుదయం నీకేదో ఉత్తరం వచ్చినట్టుంది?"

"నాకా? ఉత్తరమా? లేదే."

"అబద్ధాలు చెప్పకు. నేనే పంపించానా ఉత్తరం."

సిగ్గుతో పావెల్ మొహం కందగడ్డలాగైంది.

"జోక్ చేస్తున్నావా ఏమిటి?"

"ఏం చెయ్యను మరి. ఇవాళ యిల్లంతా కడిగించి శుభ్రం చేసే ప్రోగ్రాం పెట్టుకున్నాను. మీరింట్లో వుంటే ఎట్లాగూ పని సాగదు. ఎలాగోలా మిమ్మల్ని రెండు మూడు గంటలు బైటికి పంపించక తప్పదు మరి. ఫాంహౌస్‌లో నీ ఒక్కడికి బోర్ కొడుతుందని మిత్యాకు కూడా మరో ఉత్తరం పంపాను. ఇద్దరూ బాగా టైంపాస్ చేశారా?"

■